చూశారా మేడం..!



అనంతపురం సర్వజన వైద్యశాలలో అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎప్పుడోగానీ అటువైపు చూడరు. రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించేందుకు మంత్రి సవిత ఆస్పత్రికి వచ్చారు. కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆమె వెంట ఉన్నారు. డయాల సిస్ సెంటర్ ముందు భాగంలో డ్రైనేజీ నీటిలో వారు నడిచి వెళ్లాల్సి వచ్చింది. ఆస్పత్రిలో అపరి శుభ్రతను మంత్రి కళ్లారా చూశారు. అప్పుడప్పుడు ప్రభుత్వ పెద్దలు వచ్చి వె ళుతుంటే.. పరిస్థితులు కా స్తయినా మెరుగుపడతాయి. లేదంటే.. ఇదిగో.. ఇలా ఉంటుంది.

- అనంతపురం టౌన్

కూలిన కుటుంబాలు

- తలగాసిపల్లి వద్ద ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది మృతి.. ఐదుగురికి గాయాలు
- అరటి తోటలో పనికి వచ్చి.. అనంత లోకాలకు..
- మృతులు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామస్థులు
- సీఎం చంద్రబాబు, మంత్రులు, నాయకుల దిగ్భ్రాంతి
- మృతులకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం








గార్లదిన్నె సమీపంలోని తలగాసిపల్లి ప్రమాదంలో గాయపడ్డ మహిళలు



ప్రమాద స్థలంలో పోలీసులు, అధికారులు

వివరాలు 7, మెయిన్ 11లో..





రూరల్ క్రికెట్‌లో సెంచరీల మోత



కౌశిక్



తన్మయి కార్తీక్



తేజశ్రీ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలుర క్రికెట్ పోటీల్లో ఇద్దరు జిల్లా క్రీడాకారులు సెంచరీలు సాధించారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ ఆధ్వర్యంలో రూరల్ బాలుర క్రికెట్ లీగ్ పోటీలు శనివారం నిర్వహించారు. తపోవనం క్రికెట్ అకాడమీ అండర్-15 బాలుర జట్టు, పెనుకొండ అండర్-15 బాలుర జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన తపోవనం జట్టు 40 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 398 పరుగులు చేసింది. కౌషిక్ 108 పరుగులు, తన్మయి కార్తీక్‌రెడ్డి 101 చేశారు. అనంతరం బరిలోకి దిగిన పెనుకొండ 23.5 ఓవర్లలో 67 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో తపోవనం జట్టు 331 భారీ పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కదిరి, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా.. కదిరి 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి అనంత జట్టు 31.5 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. దీంతో కదిరి 58 పరుగుల తేడాతో గెలుపొందింది. గుంతకల్లు రైల్వేస్, ఎస్ఎస్‌బీఎన్ జట్లు తలపడగా...గుంతకల్లు రైల్వేస్ 37.2 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం ఎస్ఎస్‌బీఎన్ జట్టు 33.2 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌట్ కాగా గుంతకల్లు రైల్వేస్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. మడకశిర-గుత్తి మధ్య జరిగిన మ్యాచ్‌లో గుత్తి 28.3 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌట్ కాగా...అనంతరం బరిలోకి దిగిన మడకశిర 27.4 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గుత్తి 42 పరుగుల తేడాతో గెలుపొందింది. బాలికల విభాగంలో ఆత్మకూరు రాప్తాడు జట్లు తలపడగా...ఆత్మకూరు 30 ఓవర్లలో 9 వికెట్లకు 74 పరుగులు చేసింది. రాప్తాడు 17 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. నార్పల, బుక్కరాయసముద్రం జట్లు తలపడగా...నార్పల 30 ఓవర్లలో వికెట్ కోల్పోయి 335 పరుగులు చేసింది. ఇందులో తేజశ్రీ శర్మ 173 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. అనంతరం బరిలోకి దిగిన బుక్కరాయసముద్రం 22 ఓవర్లలో 34 పరుగులకే చాపచుట్టేసింది. దీంతో నార్పల 301 పరుగుల తేడాతో గెలుపొందింది. సెంచరీలు సాధించిన బ్యాటర్లకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.







N.B.K.R. INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(AUTONOMOUS)
Estd:1979
Affiliated to JNTUA, Anantapuramu
Accredited by NAAC with 'A' Grade
Courses Accredited by NBA under TIER-1
VIDYANAGAR - 524413, TIRUPATI- Dist. (A.P)
www.nbkrist.org Ph: 8985382247, 8985159547

WALK - IN -INTERVIEW

Qualified candidates are invited to appear for the walk-in-interview for faculty positions in college campus.

CSE, AI&DS	MCA/M.Tech /Ph.D	24-11-2024, Sunday 9.00 am to 5.00 pm
Physics, Chemistry, English, Mathematics, Management	PG/Ph.D	27-11-2024, Wednesday 9.00 am to 5.00 pm

Interested candidates may send detailed resume with recent passport size photograph in advance to the email given below.

Vidyanagar 16-11-2024 e-mail jobs@nbkrist.org CORRESPONDENT



మాకు దిక్కెవరు..?

అనంతపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రికి వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్ వద్ద ప్రమాద మృతుల కుటుంబ సభ్యులు విలపించారు. ఇక తమకు దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ అరగంట పాటు ఆందోళన చేశారు. ఎంపీ, కలెక్టర్ వారిని ఓదార్చారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు.



బైఠాయించిన బాధితులు





ప్రపంచ శాంతి వేదిక.. ప్రశాంతినిలయం

సత్యసాయిబాబా మహాసమాధి



- సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం
- గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఘనంగా సత్యసాయి జయంతి
- పాల్గొన్న దేశ, విదేశాల భక్తులు

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి అవతరించిన ప్రశాంతినిలయం ప్రపంచశాంతికి వేదికగా మారిందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ పేర్కొన్నారు. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు శనివారం ప్రశాంతినిలయంలోని సాయికుల్వంతులో కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థుల గురువందనం భక్తిగీతాల ఆలపనతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగిస్తూ సత్యసాయి తన ఆధ్యాత్మిక బోధనలు, సేవలు, ప్రేమతత్వంతో కోట్లాది మందికి ఆరాధ్యదైవమయ్యారని కొనియాడారు. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవలు వెలకట్టలేనివన్నారు. వేలాది గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి సత్యసాయి వందల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడానికి సత్యసాయి సేవా సంస్థలు ఎప్పుడు ముందుంటాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం గవర్నర్ చేతులమీదుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్టు ప్రతినిధులతో కలిసి ట్రస్టు వార్షిక నివేదికను విడుదల చేశారు.



మహాసమాధిని దర్శించుకుంటున్న గవర్నర్



సత్యసాయి బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్



ఉత్సవాలకు హాజరైన భక్తులు

సేవల ఖర్చు రూ.166 కోట్లు



సత్యసాయి బాబా చేపట్టిన సేవలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తున్నామని, ఈ ఏడాది సేవల కోసం రూ.166 కోట్లు ఖర్చు చేసినట్లు ట్రస్టు సభ్యులు నాగానందం పేర్కొన్నారు. రూ.237 కోట్లు రాబడి ఉందన్నారు. వైద్యసేవలకు రూ.100 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ.32కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.15కోట్లు, అభివృద్ధి పనులకు రూ.20కోట్లు, ఇతర కార్యక్రమాలకు రూ.28కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. బెంగళూరు వైట్ ఫీల్డ్ ఆస్పత్రిలో 16500 ఉచిత శస్త్రచికిత్సలు, 2.30లక్షల మందికి పరీక్షలు, మొబైల్ ఆస్పత్రి ద్వారా 56వేల మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు వివరించారు. ఇవేకాక కాకదేశ వ్యాప్తంగా సేవలను కొనసాగిస్తున్నామన్నారు.

ప్రధాని సందేశం

సత్యసాయి జయంతి వేడుకలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంపించిన సందేశాన్ని ట్రస్టు సభ్యులు నాగానందం చదివి వినిపించారు. సత్య సాయిబాబా మానవతా మూర్తి అని, ఆయన సేవలు వెలకట్టలేనివని, ము ఖ్యంగా అతిఖరీదైన ఉచిత వైద్యాన్ని అందరికి అందిస్తుండటం ప్రశంసనీయంటూ ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. ట్రస్టు సభ్యులు గవర్నర్‌కు, మంత్రికి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి మొక్కలు పంపిణీ చేశారు.

పాల్గొన్న వీఐపీలు

సత్యసాయి జయంతి వేడుకల్లో రాష్ట్రమంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, గీతారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, ట్రస్టు సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, ప్రసాద్, రామసుబ్రహ్మణ్యం, కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఎస్పీ రత్న, ఏఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పుట్టపర్తి తహసీల్దార్ అనుపమ, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, హీరా, కోటేశ్వరరావు, చలం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మల్లాది సోదరులు

సత్యసాయి సేవలు 139 దేశాలకు విస్తరణ: మంత్రి



సత్యసాయిబాబా తన సేవలను 139 దేశాలకు విస్తరించారంటూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. 99 సంవత్సరాల కిందట సత్యనారాయణ అవతరించారని, ఆయనే సత్యసాయి బాబాగా తన 14వ ఏట అవతరణ ప్రకటన చేసి ఆధ్యాత్మిక బోధనల ద్వారా గురువుగా పూజలందుకుంటున్నారన్నారు. అంచెలంచెలుగా తన సేవలను ప్రపంచానికి విస్తరించారని పేర్కొన్నారు. నిస్వార్థసేవలకు సత్యసాయి ప్రతి రూపమని అందుకే నేడు ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయికి లక్షలాది భక్తులు ఉన్నారన్నారు. 2020-25 సత్యసాయి స్వర్ణోత్సవాలు నిర్వహించడానికి ముందస్తు ప్రణాళిక చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి శివైక్యం తరువాత సేవలు యథావిధిగా సాగడం అంతా ట్రస్టు కృషేనన్నారు.

కన్నుల పండువగా స్వర్ణరథోత్సవం

ప్రశాంతి నిలయం వీధుల్లో స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 5గంటలకు బంగారు రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తిపాటలు పాడుతూ రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి సాయికుల్వంతులో లాలంబుడి కృష్ణబృందం సత్యసాయి జోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మల్లాది సోదరులు సంగీత గానంతో భక్తులను అలరించారు. సత్యసాయి జయంతి వేడుకలలో దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఆధార్ అనుసంధానంలో ప్రథమ స్థానం

- డీపీఓ నాగరాజనాయుడు



అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ సహకారంతోనే పంచాయతీల్లోని ప్రజల బ్యాంకు అకౌంట్లకు ఆధార్ అనుసంధానంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. శనివారం బ్యాంకు అకౌంట్ ఆధార్ అనుసంధానంపై గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా పంచాయతీ అధికారులు, ఇతర అధికారులతో గుగూల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో వెనుక బడిన వారికి చురకలు అంటించారు. వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 96 శాతం పూర్తి చేసిన అనంతపురం డీపీఓ నాగరాజనాయుడుతో డైరెక్టర్ మాట్లాడారు. మిగిలిన జిల్లాల్లో ఎవరూ ఈ స్థాయిలో చేయలేక పోయారని, మీరు ఎలా చేశారని, పాటించిన అంశాలను వివరించాలని అడిగారు. దీనిపై డీపీఓ నాగరాజనాయుడు మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలకు అనుగుణంగా సిబ్బందిని సచివాలయాల వారిగా అప్రమత్తం చేశామని తెలిపారు. సమస్యలు ఉన్న చోట తగిన సూచనలు చేశామన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎంపీడీఓల ద్వారా ఎప్పటికప్పుడు ఆరా తీసి సూచనలు ఇచ్చారని తెలిపారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి : జేడీ



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో ఆయన ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు, యార్డుల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాలు..పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యార్డుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి కమిటీలోను నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి, సత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ మూర్తి, ఉమ్మడి జిల్లా పరిధిలోని స్పెషల్ గ్రేడ్ కార్యదర్శులు, యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. డిసెంబరు 14న అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తామని పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాకు వచ్చేసిన ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న ఎంపీఈఓలు ఎట్టకేలకు తిరిగి జిల్లాకు వచ్చేశారు. ఉమ్మడి జిల్లాలో 105 మంది ఎంపీఈఓలు తిరిగి రావాల్సి ఉంది. అనంతపురం జిల్లాకు 52 మంది రావాల్సి ఉండగా ఇప్పటి దాకా 36 మంది ఎంపీఈఓలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. మిగిలిన సిబ్బంది చిత్తూరు జిల్లాలో నో డ్యూస్ సర్టిఫికెట్‌తోపాటు రిలీవింగ్ ఆర్డర్లు తీసుకొని మరో మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

గ్యాస్ డెలివరీకి అధికంగా వసూలు చేయొద్దు : జేసీ

అనంతపురంటౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ డెలివరీకి అధికంగా డబ్బులు వసూలుచేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ హెచ్చరించారు. ఆయన శనివారం రాత్రి డీఎస్ఓ వెంకటేశ్వర్లుతో కలిసి నగరంలో పర్యటించారు. వంట గ్యాస్ తీసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ... గ్యాస్ డెలివరీ చేసే బాయ్స్ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అది నిజమైతే గ్యాస్‌ఏజెన్సీపై చర్యలు తీసుకోవడంతో పాటు, డెలివరీ బాయ్స్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు





అలంకరణలో స్వామివారు, దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుత్తిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా స్వామికి వేకువ జామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి ఆకు పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహిళలు ఆలయ ఆవరణంలో దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శంచుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు



అనంతపురం విద్య, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావును ఎంపిక చేసినట్లు ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతరావు వజ్రకరూరు మండలం పీసీపీ కొత్తకోట హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మందకృష్ణ భారీ కార్యక్రమాలకు మాదిగ ఉద్యోగులను, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను చైతన్య పర్చడంలో ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు స్పష్టం చేశారు.

పదోన్నతి జేఈఈలలో... ఆందోళన..!



- పీఆర్‌లో అడహక్ ప్రమోషన్లపై ప్రభుత్వం ఆరా
- హైకోర్టు తీర్పు అమలుకు ఉన్నతాధికారుల కసరత్తు

అనంతపురం సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో సీనియారిటీని పక్కనపెట్టి గత సర్కార్ ఇచ్చిన జీఓ-71 ఆధారంగా ఇటీవల చేపట్టిన ఏఈఈలకు పదోన్నతులు కల్పించడంపై తప్పుపడుతూ.. సదరు జీఓను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆ పదోన్నతులు రద్దయ్యాయి. సీనియారిటి ప్రకారం పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఆదేశించడంతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలకు ఊరట కలిగింది. పీఆర్‌శాఖలో జరిగిన అడహక్ ప్రమోషన్లతో పాటు హైకోర్టు తీర్పు.. తదితర విషయాలపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు హైకోర్టు తీర్పుకు అనుగుణంగా తప్పులను సవరించుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అడహక్ ప్రమోషన్లు పొందిన వారితో పాటు నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలు, ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న ఏఈఈలలోను ఉత్కంఠ నెలకొంది.



పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

- ఈఎన్‌సీని కలిసేందుకు సన్నాహాలు

హైకోర్టు తీర్పుతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలలో ఉత్సాహం నెలకొంది. ఎన్నో ఏళ్ల నుంచి పోరాడి సాధించుకున్న కల తాజా తీర్పుతో నెరవెరిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని జోన్-1, జోన్-2, జోన్-3, జోన్-4 పరిధిలో పనిచేస్తున్న నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలందరూ కలిసి త్వరలోనే ఆ శాఖ ఈఎన్‌సీని కలిసి వెంటనే హైకోర్టు తీర్పును అమలు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

- ఎఫ్ఏసీ, ఓడీలో పనిచేస్తున్న వారిలో ఉత్కంఠ

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతి రావాలన్నా.. ఎఫ్ఏసీ, ఓడీలపై పోస్టింగులు పొందాలన్నా చాలా కష్టమైన పని. ఈ నేపథ్యంలో అడహక్ పదోన్నతులు తెచ్చిన తంటాతో అసలుకే ఎసరు వచ్చింది. ప్రమోషన్లు ఇవ్వకపోయినా ఏదో ఒకరకంగా ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేసుకునే వాళ్లం అనే అభిప్రాయం నెలకొంది. అడహక్ పదోన్నతులు ఇవ్వడం.. హైకోర్టు సదరు జీఓను కొట్టివేయడంతో తమకు పెద్ద సమస్య వచ్చి పడిందని ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేసే ఏఈఈలో ఆందోళన నెలకొంది. హైకోర్టు తీర్పుతో అడహక్ ప్రమోషన్లను మాత్రమే రద్దు చేస్తారా..? లేక.. ఎఫ్ఏసీ, ఓడీలను కూడా రద్దు చేస్తారా..? అని సదరు వర్గాల్లో ఉత్కంఠ మొదలైంది.

హైకోర్టు తీర్పు అమలుకు కసరత్తు

ఎన్నో ఏళ్ల నుంచి ఏపీపీఎస్సీ, నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌ల మధ్య నెలకొన్న పదోన్నతుల ప్రక్రియ వ్యవహారంలో తాజాగా హైకోర్టు తీర్పుతో కొంత కొలిక్కి వచ్చినట్లయింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం విమర్శలకు తావులేకుండా జాగ్రత్త పడుతున్నారనే తెలుస్తోంది. గత సర్కార్ ఇచ్చిన జీఓను హైకోర్టు కొట్టివేయడంతో ఇటీవల 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన అడహక్ పదోన్నతులను రద్దు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించే దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అడహక్ పదోన్నతులు పొందిన వారికేనా..? గతంలో ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న వారికి కూడా ఇదే షరతు వర్తించేలా చేశారా.? అనే సందేహాలు మాత్రం లేకపోలేదు. గత సర్కార్ ఇచ్చిన జీఓ-71తో ఇటీవల అడహక్ పదోన్నతులు పొందిన 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఏఈఈలలో హైకోర్టు తీర్పుతో ఆందోళన మొదలైంది. అధికార లెక్కల ప్రకారం జోన్-1,-2,-3,4 పరిధిలో మొత్తంగా 50 మంది ఏఈఈలు అడహక్ పదోన్నతులు పొందినట్లు తెలిసింది.

ఫైలు కదలాలంటే.. పైసలివ్వాల్సిందే..!

- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వింత పరిస్థితి
- వీఆర్ఓ లంచం డిమాండ్‌పై సోషల్‌మీడియాలో వైరల్
- గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ధర్మవరంరూరల్, నవం బరు 23(ఆంధ్రజ్యోతి): స్థాని క తహసీల్దార్ కార్యాలయం లో చేయి తడపనిదే ఏ ఫైలు ముందుకు కదలదని బాధి తులు చెబుతున్నారు. పైసలు ఇవ్వకుంటే నెలల తరబడి తిరిగినా పని కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం లంచాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంత డబ్బు ఇవ్వలేం

మండలంలోని పోతుకుంట గ్రామంలో సర్వేనెంబర్ 695-1లో తమ భూమి రికార్డు పత్రాలను, అందుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని రైతు శ్రీలత గత రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డబ్బులు ఇవ్వాలని అదేకార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్‌తో డీల్ చేయాలని ఆదేశించాడు. అయితే అంతడబ్బు ఇవ్వలేమని వారు తేల్చిచెప్పారు.

- నాగార్జున అనే వ్యక్తి గరుడంపల్లి గ్రామంలో భూమి కొనుగోలు చేశాడు. ఆభూమికి సంబంధించి రికార్డులు తమ పేరుపై ఉన్నాయని, రిజిస్టర్ కూడా చేసుకున్నామన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిలో దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వారికి పొజీషన్ సర్టిఫికెట్లు ఇస్తారని తెలియడంతో రెండు రోజుల కిందట నాగార్జున తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమ భూమికి పొజీషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని, అడిగినంత డబ్బులు ఇస్తే చేస్తావా? లేకుంటే చేయవా అంటూ బూతులతో రెచ్చిపోయారు. వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి కూడా బాధితుడిపై అదేస్థాయిలో రెచ్చిపోయారు. అప్పుడే పోతుకుంటకు చెందిన బాధితురాలు శ్రీలత కూడా అక్కడకు వచ్చి తమ రికార్డుల కోసం రూ. మూడు లక్షలు లంచం డిమాండ్ చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలను అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.
- కుణుతూరు పంచాయతీలో అసైన్‌మెంట్ భూములను గత ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నాయకులు అవకతవకలు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో 1బీ రాకుండా డిజిటల్ కీ పెండింగ్ పెట్టారు. అయితే ఈ భూములపై వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి వారితో మాట్లాడి డబ్బులు వసులు చేసి డిజిటల్ కీ ఇప్పించారని అప్పట్లో కొంతమంది కార్యాలయానికి వచ్చి వాగ్వాదానికి దిగారు.

సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఉన్నతాధికారులు

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డిమాండ్ చేశాడని బాధితురాలు శ్రీలత చెప్పిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను విచారణ చేసి పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు బాధితులను విచారించారు. తమను లంచం అడిగిన విషయం వాస్తవేమని పలువురు బాధితులు తహసీల్దార్ వద్ద వాపోయినట్లు సమాచారం.

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి సస్పెన్షన్

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్శినమల వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు శనివారం తెలిపారు. రైతు నుంచి మూడు లక్షలు డిమాండ్ చేయడంతో పాటు గతంలో కూడా ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డుల తారుమారు చేయడం, అధికవర్షాల సమయంలో ఆర్డీఓ ఆదేశాలను బేఖాతర్ చేయడం వంటి అంశాలు వాస్తవమని తేలడంతో గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

అంతా ఇష్టానుసారం..!

గిరిధర్‌రెడ్డి ఏడేళ్ల కిందట మండలంలోని దర్శినమల గ్రామానికి వీఆర్‌ఓగా వచ్చారు. అయితే ఆయన కొన్నాళ్లు దర్శినమల పంచాయతీతో పాటు ధర్మవరం వీఆర్‌ఓగా కూడా కొనసాగారు. ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి కుణుతూరు, పోతుకుంట, చిగిచెర్ల పంచాయతీలకు వీఆర్‌ఓగా కొనసాగారు. దీంతో ఇష్టానుసారంగా మ్యూటేషన్ అప్రూవల్స్ చేయించడం, రైతుల నుంచి లంచాలు పుచ్చుకుని పనులు చేసినట్లు పలువురు బాధితులు విమర్శిస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలోకి పనులు కోసం వెళ్లే రైతులను అధికారులు లంచాలు అడుగుతుండటంతో హడలెత్తిపోతున్నారు. భూమి రికార్డుల నుంచి పాస్‌పుస్తకాలు కోసం, విద్యార్థుల సర్టిఫికెట్ల అప్రూవల్ ఇలా ఏ పనికోసం వెళ్లినా చేయి తడపాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మధ్య వర్తులను ఏర్పాటు చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.










కూలిన కుటుంబాలు

హైవేపై ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తలగాసిపల్లి వద్ద ఘోర ప్రమాదం
ఎనిమిది మంది మృతి..
ఐదుగురికి గాయాలు
అరటి తోటలో పనికి వచ్చి..
అనంత లోకాలకు..
మృతులు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామస్థులు

గార్లదిన్నె, పుట్లూరు, అనంతపురం టౌన్/అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకుంటూ.. ఉన్నంతలో హాయిగా గడుపుతున్న కుటుంబాలలో పెను విషాదం అలుముకుంది. 'అరటి తోటకు ఎరువు వేసే పని ఉందంట.. పోదాం రండి..' అని పిలవగానే.. మొత్తం 13 మంది ఆటోలో ఆత్రంగా బయలుదేరారు. వేకువ జామున గజ గజ వణికించే చలిలో.. ముడుచుకుని కూర్చున్నారు. సూర్యుడు ఉదయించేలోగా పని ప్రదేశానికి చేరుకున్నారు. చక చకా పనులు ముగించుకుని.. సొంతూరుకు తిరుగుపయనమయ్యారు. తిమ్మంపేట సమీపంలోని అరటి తోట నుంచి కూలీల ఆటో హైవే ఎక్కింది. వారి స్వగ్రామం పుట్లూరు మండలం ఎల్లుట్ల. ఆ ఊరికి వెళ్లేందుకు గార్లదిన్నె నుంచి హైవే అండర్ పాస్ మీదుగా దారి ఉంది. ఆటో గార్లదిన్నె శివారులో తలగాసిపల్లి హైవే జంక్షన్ వద్దకు చేరుకుంది. అక్కడ రోడ్డు దాటి.. గార్లదిన్నెలోకి ప్రవేశించాలి. అటువైపు లారీ వస్తోంది. దీంతో ఆటోను ఆపాడు డ్రైవర్.! అది వెళ్లగానే ఆటోను కదిలించాడు. ఏమరుపాటులో.. లారీ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సును చూసుకోలేదు. రెండు క్షణాలుంటే హైవే దాటేవారు. కానీ కాల యముడు ఆ కాస్త సమయమూ ఇవ్వలేదు. బస్సు వేగంగా ఢీకొట్టడంతో ఆటోలో కూలీలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. ఏం జరిగిందో తెలిసేలోగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు, ఆస్పత్రిలో నలుగురు ప్రాణాలు విడిచారు. అందరూ ఒకే ఊరి జనం. ఊరంతా విషాదం నింపి.. ఏకంగా ఎనిమిది మంది ఈ లోకాన్ని వీడిపోయారు. అయిన వారికి తీరని దుఃఖాన్ని మిగిల్చారు.

ఎనిమిది మంది..

ప్రమాదంలో బాలపెద్దయ్య (55), చిన్న నాగమ్మ (60), పెద్దక్క(68), రామాంజినమ్మ(35) జయరాముడు (48), చిన్ననాగన్న(55), కొండమ్మ(50), ఈశ్వరయ్య(56) మృతిచెందారు. పెద్దులమ్మ, గంగాధర్, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, ఆటో డ్రైవర్ నీలకంఠేశ్వర తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఒక్కసారి లే నాన్నా..





కూలి పనుల కోసం వచ్చినవారిలో బాలపెద్దయ్య అలియాస్ తాతయ్య, ఆయన భార్య పెద్దులమ్మ ఉన్నారు. వీరి కూతురు నాగలక్ష్మి అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రమాదం గురించి తెలియగానే తీవ్ర ఆందోళనతో ఆస్పత్రికి చేరుకున్నారు. 'మా నాన్న ఎక్కడ..? మా అమ్మ ఎక్కడ..? వారికి ఎలా ఉంది..?' అని అక్కడున్నవారిని అడుగుతూ.. వారికోసం వెతికింది. 'మీ నాన్న ప్రమాద స్థలంలోనే చనిపోయారు. మృతదేహం మార్చురీలో ఉంది..' అని గ్రామస్థులు చెప్పడంతో అక్కడికి పరుగున వెళ్లి బోరున విలపించారు. 'నాన్నా.. ఒక్కసారి లే నాన్నా.. నావైపు చూడు..' అంటూ మృతదేహంపై పడి బోరున విలపించారు. అక్కడి నుంచి ఆస్పత్రి బెడ్‌పై ఉన్న తల్లి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

బాధ్యతలు తీరే వేళ..

బాలపెద్దయ్య, పెద్దులమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు నాగలక్ష్మి, బేబీ ఉన్నారు. కుమారుడు అనారోగ్య సమస్యలతో గతంలో మృతిచెందాడు. బేబీకి వివాహం చేశారు. నాగలక్ష్మికి పెళ్లి సంబంధం కుదిరింది. మాఘమాసంలో వివాహం పెట్టుకోవాలని అనుకున్నారు. అంతటితో తన బాధ్యత తీరిపోతుందని బాల పెద్దయ్య అందరితో అనేవాడు. చిన్న కూతురు పెళ్లి సంబంధం గురించి సంతోషంగా చెప్పుకునేవాడు. ఆ ముచ్చట తీరకుండానే ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు.



ఇంత నిర్లక్ష్యమా..?


ప్రమాదం మధ్యాహ్నం జరిగితే.. విడతలవారీగా ఎనిమిది మంది చనిపోయారు. వీరిలో ఆస్పత్రిలో మృతిచెందినవారు నలుగురు. ప్రమాద బాధితుల గురించి వైద్యులు పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారామ్ బాధితులు వచ్చినప్పుడు కనిపించలేదు. క్యాజువాలిటీలో ఉన్న డాక్టర్లే బాధితులకు వైద్య సేవలు అందిస్తూ కనిపించారు. సాయంత్రం 4-30 గంటల సమయంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరాలు అడిగితే.. తాను ఇంకా ఆసుపత్రికి వెళ్లలేదని, తమ డాక్టర్లు, సిబ్బంది చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఇంత ఘోర ప్రమాదం జరిగితే.. వైద్యాధికారుల తీరు ఇలా ఉంది. ఎంపీ, కలెక్టర్ ఆసుపత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. పరిస్థితిని గమనించి.. ప్రైవేటు వైద్యశాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షతగాత్రులు ఆస్పత్రికి రాగానే మెరుగైన వైద్యం అందించి ఉంటే.. ఒకరిద్దరైనా ప్రాణాలతో బయటపడేవారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఒంటరిగా మిగిలిన సంధ్యారాణి




రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బి.చిన్న నాగమ్మ, చిన్న నాగన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు.. శాంతి, సంధ్యారాణి ఉన్నారు. శాంతికి వివాహం జరిగింది. సంధ్యారాణి డిగ్రీ చదువుతోంది. చిన్న కూతురును బాగా చదివించి, తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలని తల్లిదండ్రులు పరితపించేవారు. అంతలోనే విధి వారిద్దరినీ బలితీసుకుంది. తల్లిదండ్రులను కోల్పోయిన సంధ్యారాణి ఒంటరిగా మిగిలిపోయింది

కొడుకు పెళ్లి చూడకుండానే..



రామాంజినమ్మ, కుళ్లాయప్ప దంపతులకు ఇద్దరు కూతుళ్లు చంద్రకళ, రేవతి, ఒక కుమారుడు కుశ్వంత్ ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించారు. కుమారుడిని ఒక ఇంటివాన్ని చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని భావించారు. కొడుకు పెళ్లి చూడకనే రామాంజినమ్మ ప్రమాదంలో మృతిచెందారు. కూలి పనులకు భార్యను పంపించిన కుళ్లాయప్ప.. ఇంటి వద్దే ఉండిపోయాడు. విషయం తెలిగానే గుండెలు బాదుకుంటూ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నాడు.

ఉమ్మడి కుటుంబంలో విషాదం



డి.పెద్ద నాగమ్మ, పుల్లయ్య దంపతులది ఉమ్మడి కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు శివయ్య, అశోక్, కూతురు శివమ్మ ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. కొడుకులు, కోడళ్లతో కలిసి సంతోషంగా గడిపేవారు. ఉదయాన్నే కోడలు లక్ష్మీదేవితో కలిసి పెద్ద నాగమ్మ కూలి పనుల కోసం ఆటోలో వెళ్లింది. ప్రమాదంలో పెద్ద నాగమ్మ మరణించగా లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు.



ఎల్లుట్లలో విషాదం

ఉదయాన్నే కూలి పనులకు వెళ్లినవారు ప్రమాదానికి గురయ్యారని తెలియగానే ఎల్లుట్లవాసులు తీవ్ర ఆవేదన చెందారు. చాలా మంది ప్రమాద స్థలానికి, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఒకేసారి ఏడుగురు మృతి చెందడంతో గ్రామం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. ఎవరిని కదిలించినా కంటతడి పెడుతున్నారు. మృతులంతా ఎస్సీ కాలనీ వాసులు కావడంతో ఆ కాలనీలో నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబం



రోడ్డు ప్రమాదంలో జయరాముడు మృతిచెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. జయరాం, జయమ్మ దంపతులు ఇద్దరూ కూలి పనులు చేస్తూ జీవించేవారు. వీరికి కుమారుడు భార్గవ్, కూతురు దేవి ఉన్నారు. భార్గవ్ ఇంటర్, దేవి ఏడో తరగతి చదువుతున్నారు. సంతోషంగా సాగిపోతున్న వారి జీవితంలో పెను విషాదం నెలకొంది. తండ్రిని కోల్పోయిన పిల్లల భవిష్యత్తు ఏమి టా అని జయమ్మ కన్నీరు మున్నీరు అయ్యారు. ఇద్దరినీ బాగా చదివిం చాలని చెప్పేవాడని, ఇప్పుడు తమకు దిక్కెవరని ఆమె బోరున విలపించారు.

ఒకరి వెనుక ఒకరు..



కూలీ పనులకు ఉదయాన్నే భర్త ఈశ్వరయ్యతో కలిసి వెళ్లిన కొండమ్మ.. ప్రమాదంలో మృతిచెందారు. ఈశ్వరయ్య తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య మృతి చెందిన విషయం తెలిసి కన్నీరుమున్నీరయ్యాడు. పరిస్థితి విషమంగా మారడంతో సర్వజన వైద్యశాల నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. రాత్రి 10 గంటల సమయంలో ఈశ్వరయ్య కూడా మృతిచెందాడు. వీరికి కుమారుడు హర్ష, కూతురు అనిత ఉన్నారు. ఇద్దరినీ బాగా చదివించి, ఉన్నతంగా చూడాలని కష్టపడ్డారు. తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తూ.. కొడుకు ఇటీవలే పోలీసు కానిస్టేబుల్ అయ్యాడు. త్వరలో పెళ్లి చేయాలని భావించారు. అనిత చదువు కొనసాగిస్తోంది. ఇంతలో తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

రూ.5 లక్షల పరిహారం ప్రకటన

అనంతపురం/అర్బన్/కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గార్లదిన్నె మండలం తలగాసిపల్లి జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొనడతో ఎనిమిది మంది కూలీలు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళుతూ చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఆదుకుంటాం: పయ్యావుల

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రమాదం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రకటిందని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు.

బాధాకరం: సవిత

ఘోర ప్రమాదంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందారని, చాలా బాధాకరమని అన్నారు. నగర శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని, బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. సర్వజన వైద్యశాల మార్చురీలోని మృతదేహాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించామని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సర్వజన వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం మంత్రి వెంట ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శ్రావణి

శింగనమల నియోజకవర్గంలో ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించారు. మృతులు, గాయపడ్డవారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. ప్రమాదంపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి ఆమె బాధిత కుటుంబాలవారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

దగ్గుపాటి ఆవేదన

ఘోర ప్రమాదంలో కూలీలు మృతి చెందడం బాధాకరమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల మృతిపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, గాయపడ్డవారికి మెరుగైన వైద్యం చేయిస్తామని భరోసా ఇచ్చారు.

వెంకటశివుడు యాదవ్ సంతాపం

రోడ్డు ప్రమాదంలో కూలీలు మృతి చెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: పూల నాగరాజు

ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్టీసీ రిజనల్ ఛైర్మన్ పూలనాగరాజు అన్నారు. గాండ్ల తెలికుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ విశాలాక్షితో కలిసి ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

బాధితులను ఆదుకోవాలి: ఓబులు

ప్రమాద బాధిత కటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూడాలని, వారి ఇళ్లలో విద్యార్థులను చదివించాలని కలెక్టర్‌ను కోరారు. కూలీల కుటుంబాలను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రభుత్వాన్ని కోరారు.

ఆదుకోవాలి: రాంభూపాల్

గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



ఆశోక్ (ఫైల్)

గార్లదిన్నె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన ఆశోక్ (35) అనే రైతు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలోని ఆశోక్, రాధిక దంపతులు నాలుగు ఎకరాల పొలంలో వేరుశనగ, వరి పంటలు సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ పంటల్లో దిగుబడి రాలేదు. దీంతో పొలంలో రెండు బోర్లు వేసి చీనీ పంటను సాగుచేశారు. గత ఏడాది బోర్లలో నీరు రాకపోవడంతో మరో నాలుగు బోర్లు వేశారు. అయినప్పటికి నీరు పడలేదు. వచ్చే అరకొర నీటితోనే చీనీ చెట్లను కాపాడుకుంటున్నారు. పెట్టుబడులు, బోర్ల కోసం సుమారు రూ. 15 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం లేక, దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చి చూడగా ఆశోక్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అంధుల అథ్లెటిక్ పోటీలు ప్రారంభం



అంధ క్రీడాకారుల హైజంప్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో శనివారం ప్రారంభమయ్యాయి. అంధుల అథ్లెటిక్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి డేవిడ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఇతరులతో సమానంగా దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తితో క్రీడా పోటీల్లోనూ ముందంజలో నిలుస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో తొలిరోజు పురుషులకు 100 మీటర్ల నుంచి 5వేల మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. మహిళలకు 100మీటర్ల నుంచి 1500 మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంధ క్రీడాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, రఘుకుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ సురేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నర్సాపురం వద్ద కొత్త రైల్వేస్టేషన్

17.97 ఎకరాల భూమి కొనుగోలు
రైతులకు మేలు చేసేలా అధికారులు పనిచేయాలి
సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెళుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలో నూతన రైల్వేస్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణానికి 17.97 ఎకరాల భూమి అవసరం ఉందన్నారు. నర్సాపురం గ్రామ సర్వే నెంబరు 177లో 9.92 ఎకరాలు, సర్వే నెంబరు 178లో 8.05 ఎకరాలు మొత్తం 17మంది రైతులకు సంబంధించి 17.97ఎకరాల భూమిని సేకరిస్తున్నామని తెలిపారు. ఎకరాకు రూ.6.25 లక్షలు ధర నిర్ణయించినట్లు వివరించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.30 లక్షల నుంచి రూ. 33 లక్షల వరకు ఉందని, ఆ మేరకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు చిత్తశుద్ధితో ఉందన్నారు. బెళుగుప్ప మండలం నర్సాపురం పరిధిలో ఒక ఏడాదిపాటు భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన సమాచారంతో నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏడాదిలో అక్కడ క్రయవిక్రయాలు జరగకుండా ఉంటే సమీపంలో ఎలా జరిగాయో వాటి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ప్రతి అధికారి చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, రైల్వేశాఖ నుంచి జగదీష్‌సాయి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శరత్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శరత్‌కుమార్‌ను నియమిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో డీఈగా పనిచేస్తున్న శరత్‌కుమార్‌ను హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఇదివరకు హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా ఉన్న శ్రీనివాసులు గత నెల పదవీ విరమణ పొందారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సబ్‌డివిజన్-2లో డీఈగా పనిచేస్తున్న వెంకటేశులు శెట్టిని ధర్మవరం డివిజన్-10 ఈఈగా బదిలీ చేశారు. మైనర్ ఇరిగేషన్ ఐబీ డివిజన్‌లో తాడిపత్రి డీఈగా పనిచేస్తున్న రాము ఆరవేటిని అనంతపురం ఇరిగేషన్ ఐబీ డివిజన్ ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మైనర్ ఇరిగేషన్ సర్కిల్‌లో డీఈగా ఉన్న ఉషారాణిని కర్నూలు హంద్రీనీవా ఎస్ఈ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

అటవీ స్థలాల ఆక్రమణపై చర్యలు
నూతన డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పా



అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నూతన డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పా పేర్కొన్నారు. శనివారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఆయన పలు అంశాలను వెల్లడించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో కృష్ణ జింకలు, ఇతర వన్యప్రాణుల నుంచి రైతులు పంటలు నష్టపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో స్థానిక సిబ్బంది ద్వారా కృష్ణ జింకల సంఖ్య ఎంత ఉందన్న వివరాలు తయారు చేయాలని ఆదేశించామని తెలిపారు. వివరాలు వచ్చిన వెంటనే వాటికి రక్షణ కల్పించడంతో పాటు రైతులకు పంట నష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో అటవీ స్థలాలకు సంబంధించి ఆక్రమణలు ఉన్నట్లు తెలిసిందని వివరించారు. అటవీ స్థలాల్లో ఆక్రమణలు ఉంటే వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో హద్దులు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా హద్దులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు ఆహ్లాదం పెంచేలా నగర వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మొక్కలు నాటడానికి ప్రాధాన్యం కల్పించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.



ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647 AJA-198474

WANTED

wardens, Nurse Montessori Elite EM school gollapalli (vill), rapthadu(mandal), anantapur. Contact:8340038384,9052061355 AJA-198475

అర్జంటుగా కావలెను

మా S.R.సంస్థ నందు పనిచేయుటకు 10th, Inter చదివి 25సం.లోపు యువతి, యువకులు 24మంది కావలెను. సంపాదన నెలకు రూ.12000/- నుంచి రూ.25000/- + రూం ఫ్రీ, కడప సెల్: 79893 89001 AJC-196242

టెలి కాలర్స్ కావలెను

కార్తికేయ బిల్డర్స్ & డెవలపర్స్ ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు మార్కెటింగ్, ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్ కావలెను. సంప్రదించండి సెల్: 9440949467, 6281504462 AJA-198477

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926. AJA-224778

JOBS

★ డిసెంబర్ రెండవ వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి పనులు చేయుటకు 40-50 సం. వయస్సు గల ఆడ మనిషి కావలెను. USA విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ఫోన్: 81217 42155 AJH-99096

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సంక్షిప్తం

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నార్పల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఎంపీడీఓ గంగావతి, ఎంఈఓ నారప రెడ్డితో కలసి పరిశీలించారు. విద్యార్థులతో మాటాడుతూ... భోజనం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో నాణ్యతప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదులు వస్తే ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు. అనంతరం ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ పరిశీలించారు.

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్య దర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 35వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 27 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 67 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు మౌనగిరి వార్షికోత్సవం

రాప్తాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపాన ఉన్న మౌనగిరి హనుమన్ క్షేత్రం ఏడో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు మౌనగిరి వ్యవస్థాపకులు ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాకతీయ కార్తీక వనభోజనం

అఖిల భారత కాకతీయ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాప్తాడు మండలం హంపాపురం వద్ద కార్తీక వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. 44వ జాతీయ రహదారి పక్కన నాగేశు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అఖిల భారత కాకతీయ ఉద్యోగుల సేవా కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు

కనగానపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని, అశ్రద్ధ వహించరాదని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సోలీమన్ విద్యార్థులకు సూచించారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్‌వాడీ, పాఠశాలల్లో వైద్యసిబ్బంది కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ పాల్గొన్నారు. అనంత రం కనగానపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యాధికారి చెన్నారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాల్లో షరతులు ఎత్తివేయాలి

అనంతపురం సెంట్రల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లనిర్మాణాల్లో దళిత, గిరిజన ప్రజలకు ప్రభుత్వం విధించిన షరతులు ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేకు శనివారం హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశు, దిలీప్, ఆదినారాయణ, మారెన్న, ఈశర్వయ్య, గోపాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన ఈశ్వరయ్య కుమారుడు జీవన్‌కుమార్(18) బేల్దారి పనిచేస్తుంటాడు. గత నెల 12న రవి అనే యువకుడితో కలిసి నగరానికి బైక్‌లో వచ్చాడు. తిరిగి ఊరికి వెళ్తుండగా ఆలమూరు రోడ్డులో మరో వాహనం ఢీ కొనడంతో కింద పడి తీవ్రగాయాలకు గురయ్యాడు. అతడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప గ్రామోత్సవం



గుమ్మేపల్లిలో గ్రామోత్సవం

శింగనమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మేపల్లిలో శనివారం అయ్యప్ప భక్తులు, గ్రామసర్పంచ్ ఆధ్వర్యంలో అయ్యప్ప గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామిని గ్రామంలో ఊరేగించారు. గ్రామసర్పంచ్ డేగల లలితమ్మ, డేగల కృష్ణమూర్తి గ్రామస్థులు పాల్గొన్నారు.

కత్రిమల బ్రిడ్జికి మోక్షం

- రెండు దశాబ్దాల తరువాత నిధుల మంజూరు
- నిర్మాణం పూర్తి అయితే మూడు మండలాలకు ప్రయోజనం



కంపచెట్లతో దర్శనమిస్తున్న బ్రిడ్జి పిల్లర్లు

గార్లదిన్నె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాలకు పైగా మరుగన పడిన బ్రిడ్జి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల ఆశలకు మోసులొచ్చాయి. పామిడి మండలం కత్రిమల, కోనేపల్లి, కోనేపల్లి తండా తదితర గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం బ్యాంకు తదితర పనుల కోసం గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల డ్యాం గ్రామానికి వెళ్తుంటారు. అలాగే ఆయా గ్రామాల విద్యార్థులు పెనకచెర్ల డ్యాంలోని పాఠశాలకు వెళ్తారు. అయితే వారికి సరైన దారి లేదు. దీంతో పెనకచెర్ల కొత్తపల్లి, డ్యాం గ్రామాల మధ్య ఉన్న పెన్నానదిని దాటుకుని వెళ్తుంటారు. అయితే నదిలో నీరు ప్రవహిస్తే అనేక అవస్థలు పడాల్సి ఉంది. దీంతో పెన్నానదిపై బ్రిడ్జి నిర్మిస్తే పామిడి, గార్ల దిన్నె మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. అప్పట్లో గార్లదిన్నె ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి హాజరైన అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి సుమారు 15 కోట్లు మంజురు చేశారు. కారణాలు తెలియ దు కానీ బ్రిడ్జి నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. ఆ తరువాత ఎవరూ పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు అవసరమైన నిధుల మంజురుకు ఆమోదం తెలిపింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల, డ్యాం గ్రామాలతో పాటు పామిడి మండలంలోని కత్రిమల, పాళ్యం, తండా, వెంకటాంపల్లి తండా, పందికుంట, ఎద్దులపల్లి తదితర గ్రామాల రైతులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. అదేవిధంగా కూడేరు మండలంలోని పలు గ్రామాల ప్రజలకూ ఉపయోగమని పలువురు అంటున్నారు.

మూడు గ్రామాలకు ప్రయోజనం



బ్రిడ్జి నిర్మాణం అయితే గార్లదిన్నె, పామిడి మం డలాల ప్రజలకు ఎంతో ప్రయోజనం. పామిడి మం డలంలోని కత్రిమల, పాళ్యం, తండా, వెంకటాంపల్లి తండా, పందికుంట, ఎద్దులపల్లి తదితర గ్రామాల ప్రజలు ఎక్కువగా పెనకచెర్ల (ఎంపీఆర్) డ్యాంకు నిత్యం వివిధ పనులపై వెళ్తుంటారు. ప్రస్తుతం పెన్నానది దాటి వస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే పెనకచెర్ల, కొత్తపల్లి, ఎంపీఆర్ డ్యాం గ్రామాల ప్రజలు గుంతకల్ వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

- శివ, కొత్తపల్లి, గార్లదిన్నె మండలం

మా కల సాకారం అవుతుంది



గార్లదిన్నె మండలం పెనకచెర్ల కొత్తపల్లి సమీపంలో పెన్నానదిపై బ్రిడ్జి పూర్తి అయితే పామిడి మండలంలోని పలు గ్రామాల ప్రజల కల సాకారం అవుతుంది. కత్రిమల, కోనేపల్లి, తండా, వెంకటాంపల్లి, పందికుంట, ఎద్దులపల్లి తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఎంపీఆర్ డ్యాంకు వెళ్తుంటారు. దారి సరిగా లేక పెన్నానదిలో ప్రయాణించాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి గార్లదిన్నె, పామిడి, కూడేరు మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరం.

- నరేష్, కత్రిమల, పామిడి మండలం

త్వరలోనే టెండర్లు నిర్వహిస్తాం



బ్రిడ్జి నిర్మాణంలో ఆలస్యమైన విషయం వాస్తవమే. బ్రిడ్జి నిర్మాణానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పిల్లర్ల వరకే నిలచిపోయింది. పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వంలో నబార్డుకు నివేదికలు పంపాం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజురయ్యాయి. త్వరలోనే టెండర్లు నిర్వహిస్తాం

- మురళీధర్, పంచాయతీ రాజ్, పీఐటీయూ డీఈఈ

సభ్యత్వ నమోదును బాధ్యతగా చేపట్టాలి

- రాప్తాడు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలి
- టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/రామగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు బాధ్యాతగా తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాన్ని పూర్తి చేసి రాప్తాడు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నారు. మండలాలలో చేపట్టిన సభ్యత్వ ప్రక్రియపై ఆమె శనివారం టీడీపీ చెన్నేకొత్తపల్లి, రామగిరి కార్యాలయాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, బూత్‌ల వారీగా సభ్యత్వ నమోదు వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...నియోజకవర్గంలో చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలు వెనుకంజలో ఉన్నాయన్నారు. ఇప్పటి నుంచైనా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో 65 వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటికే సగానికిపైగా పూర్తయిందన్నారు. టీడీపీపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, అధికారంలోకి వచ్చిన తరువాత అది మరింత పెరిగిందన్నారు. దీంతో చాలా మంది సభ్యత్వ నమోదుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. అయితే నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లేక వారిని ప్రోత్సహించడంలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విరివిగా సభ్యత్వాలు చేయడం వల్ల మంచిఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఆయా మండలాల కన్వీనర్లు ముత్యాల్‌రెడ్డి, సుధాకర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, రామ్మూర్తినాయుడు, అంకే అమరేంద్ర, రాజు, ఫణీంద్ర, ఏపీ శ్రీనివాసులు, ముత్యాలప్ప, రామగిరి మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, రఘువీరప్ప, ఎస్సీసెల్ సుబ్బరాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, పోలేపల్లి ప్రభాకర్, దుబ్బార్లపల్లి వెంకటేశ్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చీపుర్లూ ఇవ్వలేరా..?

- కొమ్మలతో రోడ్లు ఊడ్చి నిరసన



కొమ్మలతో ఊడుస్తూ నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ నగరంలో మున్సిపల్ కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం పాతూరులోని గాంధీబజార్‌లో చెట్ల కొమ్మలతో రోడ్లు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ... కార్మికులకు పనిముట్లు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. అధికారులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ, చేయని పనులకు బిల్లులు చేసుకుంటున్నారని విమర్శించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సమస్యలు పట్టించకోవడం లేదన్నారు. పనిముట్లు ఇవ్వకపోతే కార్మికులు ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. పనిముట్లు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేంద్రబాబు, తిరుమలయ్య, దేవమ్మ, ఎర్రప్ప, మాధవయ్య, రామాంజి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న శబరి వరప్రసాద్

అనంతపురం కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ మహాసభ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని వివరించారు. పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్య సామాజిక వర్గమంతా పెద్దసంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నీతివంతమైన బీజేపీ పాలనకే పట్టం: సందిరెడ్డి



అనంతపురం సెంట్రల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నీతివంతమైన బీజేపీ పాలనకే దేశ ప్రజలు పట్టం కడుతున్నారని బీజేపీ అనం తపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇందుకు మహారాష్ట్రలో మరోసారి గెలుపొందడం నిదర్శనమన్నారు. ఆయన శనివా రం ఆయన మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్ర మోదీ.. అభివృద్ధిని, సంక్షే మాన్ని సమపాళ్లలో అందిస్తున్నారన్నారు. నీతివంత మైన పాలన, ప్రపంచదేశాల్లో భారత్‌ను గుర్తిస్తున్న తీరుకు దేశ ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఇండియా కూటమి పరపక్వతలేని చిల్లర కామెంట్లను ఆపాలన్నారు. అడలేక మద్దెల దరువు అన్నచందంగా ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహారాష్ట్ర ప్రజలకు అనంతపురం బీజేపీ శాఖ తరపున ధన్యవాలు తెలిపారు.

ముందస్తుగా ఎన్‌సీసీ దినోత్సవాలు



ఎన్‌సీసీ విద్యార్థులతో అధికారులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ దినోత్సవ ముందస్తు సంబరాలు శనివారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురష్కరించుకుని 6(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కులకర్ణి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. క్యాడెట్లకు వివిధ రకాల ఆటలు, సాంస్కృతిక, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ షేక్ హసబ్ అలీ, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సుబేదార్ మేజర్ బల్బీర్‌సింగ్ పాల్గొన్నారు.

రైతు సంఘాన్ని బలోపేతం చేద్దాం

- జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్

నార్పల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు సంఘాన్ని బలోపేతం చేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ పేర్కొన్నారు. నార్పల మండలంలోని బీ పప్పూరు, హెచ్ శోదనపల్లి, తుంపెర గ్రామాలలో శనివారం రైతు సంఘం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రావలసిన సంక్షేమ ఫలాలపైన పోరాటానికి రైతులు కలసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి అధిక నిధులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం రైతు సంఘం కమిటీలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు మధుయాదవ్, నార్పల మండల మండల కార్యదర్శి లలితమ్మ, సంజీవరాయుడు, చిన్ననాయుడు, కుల్లాయప్ప, భాస్కర్, నారాయణరెడ్డి, సదాశివ, తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 పురుషుల క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను శనివారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి ప్రకటించారు. జట్టులో ఎంకే దత్తారెడ్డి (కెప్టెన్), అర్జున్ టెండూల్కర్, వీరారెడ్డి, యోగానంద, దీపక్, మనోజ్ కుమార్, మల్లికార్జున, ఎంకే లోహిత్ సాయికిశోర్, ప్రదీప్‌రెడ్డి, ప్రశాంత్, జైకృష్ణ, ప్రమోద్, ఖాదర్ వలీ, రోహిత్‌రోషన్, లీలాసాయి, మహేంద్రరెడ్డి ఎంపికయ్యారు. కోచ్‌గా నరేష్ నియమితులయ్యారు. ఎంపికైన జట్టు ఈనెల 24 నుంచి కడపలో నిర్వహించే ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అండర్-23 రాష్ట్రస్థాయి జోనల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

రీసర్వే తప్పులు సరిచేయండి

శింగనమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే గ్రామసభలో రైతుల నుంచి వచ్చిన భూమి వివరాల రిమార్కులను గ్రామ సర్వేయర్లు క్షుణంగా పరిశీలించి సరిచేయాలని జిల్లా సర్వేశాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ అంజనప్ప పేర్కొన్నారు. ఆయన శనివారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే గురించి తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ సర్వే ప్రకారం భూమి వివరాల్లో తప్పులు దొర్లాయని, ఇటీవల జరిగిన గ్రామసభల్లో చాలా మంది అర్జీలు ఇచ్చారని అన్నారు. వాటిని క్షుణంగా పరిశీలించి రికార్డులలో తప్పులు లేకుండా చేయాలని గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. అలాగే సర్వేయర్ల రిజిస్టరను తనిఖీ చేశారు.

ఎంపీ బీకేకి ఎంపీఈఓల సన్మానం



ఎంపీ బీకే పార్థసారథిని సన్మానిస్తున్న ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓలు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమ సమస్యలపై స్పందించిన ఎంపీ బీకే రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి, తమను తిరిగి జిల్లాకు రప్పించినం దుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం నగరంలోని ఎంపీ నివాసంలో శనివారం ఆయనకు శాలువా కప్పి, పూల మాల వేసి సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓల సంఘం నాయకులు నరేష్‌బాబు, భాస్కర్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

మల్లికార్జునుడి సన్నిధిలో ఎమ్మెల్యే దగ్గుపాటి



ఎమ్మెల్యేని ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు

అనంతపురం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శనివారం శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద మంత్రాలతో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకోవడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మెరుగైన ప్రయాణమే లక్ష్యం: పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం అందించడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని సంస్థ జోనల్ చైర్మన్ పూల నాగరాజు సూచించారు. శనివారం అనంతపురం బస్టాండుపై గల తన కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఆర్ఎంలు, డీఎంలతో సమావేశమయ్యారు. ప్రతి బస్టాండు పరిధిలోనూ మహిళల మరుగుదొడ్ల నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా డిపోల మేనేజర్లు సిబ్బందికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, సత్యసాయి జిల్లా డీపీటీఓ మధుసూదన్, అనంతపురం డిప్యూటి సీటీఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు, డీఈఈ సురేంద్రబాబు, అనంతపురం, సత్యసాయి జిల్లాల డీఎంలు పాల్గొన్నారు.

ఆసుపత్రి నుంచి బాధితుడి పరారీ



కురుబ రాజప్ప (ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గాయపడ్డ బాధితుడు పరారైనట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మాడిమాకులపల్లికి చెందిన కురుబ రాజప్ప మద్యానికి బానిసయ్యాడు. కొన్ని రోజుల క్రితం కింద పడి చేతికి తీవ్రగాయం కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రభుత్వాసుపత్రి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదివరకు జుట్టుతో ఉన్న అతడు ప్రస్తుతం గుండు చేయించుకున్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9440796806కు సమాచారం అందించాలని సీఐ శ్రీకాంత్ కోరారు.

ఓబన్న జయంతిని అధికారికంగా జరపాలి

- సీఎం చంద్రబాబుకు దేవళ్ల మురళి వినతి

అనంతపురం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని సీఎం చంద్రబాబునాయుడును వడ్డెర్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి కోరారు. ఆయన శనివారం విజయవాడలో సీఎంను కలిసి విన్నవించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం నాయకులు కుంచెపు వెంకటేష్, రవీంద్ర, వర్మ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో పర్యటించిన డీపీఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మేజర్ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీపీఓ నాగరాజునాయుడు సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఆయన శనివారం ఆత్మకూరు పంచాయతీలోని పలు ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని ఈఓఆర్డీ, ఎంపీడీఓలకు డీపీఓ సూచించారు. ముఖ్యంగా మురుగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

తగిన సిబ్బందిని నియమించండి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తగినంత సిబ్బందిని నియమించి యాడికి మేజర్ పంచాయతీకి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని యాడికి సర్పంచ్ అనూరాధ డీపీఓ నాగరాజునాయుడును కోరారు. సర్పంచు శనివారం డీపీఓ కార్యాలయంలో ఆయనను కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. అనంతరం యాడికి పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్న సిబ్బందిని బదిలీ చేశారు కానీ కొత్త వారిని నియమించలేదన్నారు. స్పందించిన డీపీఓ వీలైనంత త్వరగా తగిన సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు.

లక్ష్యాలను సకాలం పూర్తి చేయండి

- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలం పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. ఆయన శనివారం ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు, యార్డుల కార్యదర్శులతో అనంతపురం మా ర్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీల వారీగా లక్ష్యాలు, పురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ మూర్తి, ఉమ్మడిజిల్లా పరిధిలోని స్పెషల్ గ్రేడ్ కార్యదర్శులు, ఇతర యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.



క్లుప్తంగా..

రక్తదాన శిబిరం

గుంతకల్లు టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరాన్ని జేవీవీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టూటౌన్ సీఐ మస్తాన్, రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. అనంతరం కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు , పీడీలు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుంతకల్లు టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంథోని స్ట్రీట్, కూరగాయల మార్కెట్ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని శనివారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడులు చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని, అలాగే వారి నుంచి రూ. 59,350ల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఆహార భద్రతపై అవగాహన

గుంతకల్లుటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి కల్యాణమండపంలో శనివారం హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆహార భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్‌సేఫ్టీ ట్రైనర్ యశోద మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి తినబండారంలోనూ కల్తీ వస్తోందన్నారు. వ్యక్తిగత శుభ్రత, ఆహార భద్రత పాటిస్తూ తయారు చేసిన పదార్థాలను ప్రజలకు అందించాలని తెలిపారు. ప్రతిఒక్క వ్యాపారి ఫుడ్‌లైసెన్స్, ఫుడ్ ట్రైనింగ్ సర్టిఫికెట్, ఫాస్ట్‌ట్రాక్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గుత్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్‌లో గల సుందరయ్యకాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తనిఖీ శనివారం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ.. సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఢిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానంపై హర్షం

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడానికి అసెంబ్లీ తీర్మానించడం హర్షణీయమని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జేఎఫ్‌సీఎం కోర్టు బార్ అసోసియేషన్ వద్ద శనివారం న్యాయవాదులు సమావేశమై ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు బెంచ్ తోపాటు మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తను కూడా ఏర్పాటుచేయాలని కోరారు. న్యాయవాదులు లక్ష్మన్న, రజబ్‌వలి, భాస్కర్ గౌడు, బడేసాబ్, పత్తికొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ బిల్లింగ్ సర్వీస్ కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ట్రాన్స్‌కో డీఈఈ నాగేంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కనుక వినియోగదారులు విద్యుత్ బకాయిలను సర్వీస్ కేంద్రాలకు వెళ్లి చెల్లించవచ్చని తెలియజేశారు.

రుణాల రికవరీపై దృష్టి సారించాలి

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ వెలుగు పీడీ ఈశ్వరయ్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం ఆయన ఉరవకొండ క్లస్టర్‌లోని సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ గంగాధర్, డీపీఎం సత్యనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ శివ, ఏపీఎంలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

బెళుగుప్ప, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లిలో టీడీపీ కార్యకర్త వెంకటరామిరెడ్డి (35) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కార్యకర్త మృతి పట్ల నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, శివప్ప, దేవప్ప, ఓబుళేసు, రమేష్, శివ కుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కుందుర్పి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నగేష్ తెలిపారు. మండలంలోని వెంకటంపల్లి చెక్‌పోస్టు వద్ద మందలపల్లి గ్రామానికి చెందిన గంగాధర కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అలాగే అతడి వద్ద నుంచి 270 మద్యం ప్యాకెట్లతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

డీలర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక

కూడేరు. నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ఎంఎంహళ్లి పూజారి రాజును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సీఎస్ డీటీ లక్ష్మీదేవి డీలర్లతో సమావేశం న్విహించి డీలర్ల సంఘం మండల కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా ఎంఎంహళ్లి పూజారి రాజు, ఉపాధ్యక్షుడిగా అంతర్‌గంగ డీలర్ చంద్రన్న, కమిటీ మెంబర్లుగా పలువురుని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసుల సహకారంతో డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రాజును తోటి డీలర్లు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షుడికి స్వీటు తినిపిస్తున్న డీలర్లు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు, మురడి, అప్పలాపురం ఆంజనేయస్వామి మూలవిరాట్‌లు

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు ..

● పెద్దఎత్తున తరలివచ్చి భక్తులు

బొమ్మనహాళ్/ డీ. హీరేహాళ్/ రాయదుర్గం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం అష్టోత్తర పూజలు, ఆకు పూజలు చేసి మహా మంగళహారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకుని అర్చనలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లు, డీ హీరేహాళ్ మండలం మురడి, రాయదుర్గం మండలం వడ్రవన్నూరు సమీపంలోని అప్పలాపురం ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నేమకల్లు ఆంజనేయస్వామిని రాయదుర్గం కోర్టు న్యాయాధికారి రమ్య దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాయదుర్గం మండలం మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

● బొమ్మనహాళ్ మండలం రంగాపురంక్యాంప్‌లో ఆంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రాము తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేకాభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో గణపతి పూజ, నవగ్రహ పూజ, 101 కలశాల పూజ, ధ్వజారోహణం చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డిసెంబరు 15లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించండి

● జేడీఏ ఉమామహేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ

ఉరవకొండ/ యాడికి/ బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫసల్ బీమా యోజనకు సంబంధించి పం టల బీమా ప్రీమియంను రైతులు డిసెంబరు 15వ తేదీ లోపు చెల్లించాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. ఉరవకొండ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఆమె డివిజన్‌లోని వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంటల బీమా ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. వేరుశనగకు ఎకరాకు రూ. 480, జొన్నకు రూ.315, మొక్కజొన్నకు రూ.525, పప్పుశనగకు రూ.450 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. డిసెంబరు 15వ తేదీ లోపు చెల్లించాలని కోరారు. ప్రీమియం చెల్లింపుపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డీఆర్సీ పీడీ మద్దిలేటి, ఏడీఏలు పద్మజ, శైలజ, ఏవోలు శ్రీనివాసులు, శుభకర్, మధుకర్, పెన్నయ్య, స్వాతి, ఏఈవోలు పాల్గొన్నారు.

అలాగే ఫసల్ బీమా యోజనకు సంబంధించి పం టల బీమా ప్రీమియంను డిసెంబరు 15వ తేదీ లోపు చెల్లించాలని యాడికి ఏఓ మహబూబ్‌బాషా, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పార్టీ సభ్యత్వ నమోదును జోరుగా చేపట్టారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, నాయకుడు పయ్యావుల నాగరాజు తదితరులు ఇంటింటా తిరుగుతూ సభ్యత్వాలు చేయించారు. ఇప్పటికి 500 సభ్యత్వాలు చేయించామని, టీడీపీ సభ్యత్వం పొందితే కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ కార్యక్రమం చేపడుతున్నామని నాయకులు తెలిపారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహేంద్ర, ఉంతకల్లు మాజీ ఎంపీటీసీ కెంచప్ప, నాయకులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్‌లో సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

ప్రతి కూలీకి పని కల్పించాలి : పీడీ

బెళుగుప్ప, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సలీంబాషా ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, ఏపీఓలు సూర్యప్రకాష్, మురళికి సూచించారు. మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి కూలీలతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని కోరారు. గిట్టుబాటు కూలీ రూ. 300లు వచ్చేలా పనులు చేయాలని సూచించారు. నీటి కుంటలు, గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఏపీవోను ఆదేశించారు. ఏపీడీ శైలజ, టీడీపీ నాయకుడు మల్లికార్జున, టీఏలు స్వాతి రామకృష్ణ, ఎఫ్ఏ యర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న పీడీ సలీమ్ బాషా

మహారాష్ట్రలో బీజేపీ గెలుపుపై సంబరాలు

కళ్యాణదుర్గం/ గుంతకల్లు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలో బీజేపీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. పలువురు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, అందుకు మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలుపే నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజు, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలో మార్కెట్ రోడ్డులో గల ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనం వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, నాయకులు మహేష్, గుర్రం సూర్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు సంబరాలు చేసుకున్నారు.

కేక్‌కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు

తాడిపత్రి: జార్ఖండ్‌లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించడంతో పాటు కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రియాంకాగాంధీ విజయదుందుభి మోగించడంతో పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యనారాయణరెడ్డి నాయకులు మధు, మహబూబ్‌బాషా, గౌస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

26న మహాధర్నా

యాడికి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26వ తేదీన అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ తెలిపారు. పట్టణంలో శనివారం సీపీఐ, సీపీఎం, ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిన్నప్పయాదవ్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాటిని నిరసిస్తూ మహాధర్నా తలపెట్టామన్నారు. మండలంలోని ఉన్న అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, మండల కార్యదర్శి జూటూరు రఫీ, తాడిపత్రి తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి ఓబిరెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు నీలూరి లక్ష్మయ్య, శ్రీరాములు, నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

విడపనకల్లు: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న మహాధర్నా నిర్వహించనున్నామని, కౌలు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కరకముక్కల గ్రామంలో ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. 26న చేపట్టే ధర్నాకు రైతులందరూ తరలి రావాలని కోరా రు. కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, బాల రంగ య్య వెంకటేశులు, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

వ్యాలీగ్రీన్ గార్మెంట్ పరిశ్రమ సందర్శన

పామిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాంపల్లి సమీపంలో టీడీపీ నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి నిర్మించిన వ్యాలీగ్రీన్ గార్మెంట్ పరిశ్రమను గార్లదిన్నె ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాలీగ్రీన్ గార్మెంట్ పరిశ్రమలోని మిషనరీలు, ఐరన్ సెక్షన్, క్వాలిటీ సెక్షన్ తదితరాలను క్షున్నంగా పరిశీలించారు. అనంతరం పెరుమాళ్ల జీవానందరెడ్డితో మాట్లాడారు. గార్మెంట్ పరిశ్రమని స్థాపించి వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలిపించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు నరసింహులు, అరుంధతి, జ్యోతి, ప్రొడక్షన్ మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



గార్మెంట్ పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఘనంగా సత్యసాయి జయంతి



తాడిపత్రిలో ప్రత్యేకాలంకరణలో సత్యసాయిబాబా విగ్రహం

తాడిపత్రి/ యాడికి/, కళ్యాణదుర్గం రూరల్/ బెళుగుప్ప, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసా యి బాబా జయంతి వేడుకలను పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజలు జరిపారు. ఓంకారం, సుప్రభాత సేవ, సత్యసాయివ్రతం, నారాయణసేవ, ఊంజల్ సేవ, భజన, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థానిక తన నివాసంలో బాబా చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాకు తాగునీరు అందించిన ఘనత సత్యసాయికే దక్కిందని కొనియాడారు. యాడికి మండలం నగరూరులో సత్యసాయి జయంతిని సత్యసాయి వాటర్‌సప్లై కార్మికులు నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. కళ్యాణదుర్గం పట్టణంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో , సత్యసాయి వాటర్ ట్యాంక్ వద్ద, చాపిరి ఉన్నత పాఠశాలలో సత్యసాయి జయంతి వేడుకలను నిర్వహించారు. బెళుగుప్పలో సత్యసాయి సేవా సమితి సభ్యులు స్థానిక సాయి మందిరంలో సాయిబాబా జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి కీర్తనలు ఆలపించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

కనకదాస విగ్రహావిష్కరణకు తరలిరండి

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీరప్ప సర్కిల్లో ఆదివారం చేపట్టనున్న కనకదాసు విగ్రహావిష్కరణను జిల్లాలోని కురుబలందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని కురుబ సంఘం పట్టణాధ్యక్షుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక బీరప్ప ఆలయం వద్ద శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం రైల్వే గ్రౌండ్ వద్ద నుంచి పాతగుంతకల్లులోని బీరప్ప సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మంత్రి సవిత, అనంతపురం, హిందూపురం ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు హాజరు కానున్నారన్నారు. కురుబ లందరూ తరలిరావాలని కోరారు. సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించండి

అనంతపురం న్యూటౌన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): యాడికి మేజర్ పంచాయతీకి తగిన సిబ్బందిని నియమించి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సర్పంచ్ అనురాధ డీపీఓ నాగరాజనాయుడు ను కోరారు. జిల్లాకేంద్రంలోని డీపీఓ కార్యాలయంలో శనివారం ఆమె డీపీఓ నాగరాజనాయుడును కలిసి మాట్లాడారు. యాడికి పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను తెలిపారు. సాధారణ బదిలీల్లో ఉన్న సిబ్బందిని బదిలీ చేశారని, తర్వాత కొత్త సిబ్బందిని నియమించలేదని అన్నారు. దీంతో సమస్యగా ఉందన్నారు. దీంతో విలైనంత త్వరగా తగిన సిబ్బందిని నియమించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.

రేషన్ డీలర్ల సమావేశం

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ మునివేలు రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన హనుమంతు(58) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఈనెల 21న కళ్లుదేవనహళ్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమంతు గాయపడ్డాడు. ఆయన్ను బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలి

విడపనకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లు స్థలాన్ని ఇచ్చి ఆదుకోవాలంటూ సీపీఐ నాయకులు శనివారం విడపనకల్లు గ్రామ సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. పేదలకు మూడు సెంట్లు స్థలాన్ని ఇచ్చి ఆదుకోవాలని, అలాగే ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇచ్చి ఇంటిని నిర్మించి ఇవ్వాలని అన్నారు. పేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వన్నూరమ్మ, మల్లికార్జున, గ్రామ పేద ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



మాణిక్యమ్మ(ఫైల్)

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కౌకుంట్ల సమీపంలో శుక్రవారం రాత్రి హంద్రీనీవా కాలువలో గ ల్లంతైన మహిళ మృతదేహం శనివారం లభ్యమైంది. మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన లాల్ స్వామి, అతని భార్య మాణిక్యమ్మ రాంపురంలోని ఎర్రితాత ఆలయానికి ద్విచక్రవాహనంలో వెళ్లారు. కౌకుంట్ల వద్ద కాలువ గట్టుపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి, వాహనంతో పాటు వారు కాలువలో పడి పోయారు. లాల్‌స్వామి అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నాడు. భార్య కనిపించకపోవడంతో స్థానికులకు సమాచారమందించాడు. ఆమె ఆచూకీ కోసం స్థానికులు గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం కుటుంబసభ్యులు అందరూ గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం కాలువలో కంపచెట్లకు తగులుకున్నట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీసి చూసి మాణిక్యమ్మగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు: జేసీపీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించ రాదని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం, హాస్టల్‌వార్డెన్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలన్నారు. ముఖ్యంగా జనరల్‌నాలెడ్జ్ వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో కొందరు విద్యార్థులు చాలా సులువైన ప్రశ్నలకు కూడా సమాధానాలకు చెప్పలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. విద్యార్థులపట్ల, తల్లిదండ్రులపట్ల పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు సక్రమంగా వ్యవహరించాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి అందించే ఆహారంలో ఎలాంటి అవకతవకలు జరగకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఆయాపాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై వినూత్న రీతిలో అవగాహన

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలపై పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు సేవ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శనివారం వినూత్నరీతి లో అవగాహన ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు యముడు, చిత్రగుప్తుడు వేషధారణలో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొబైల్ ఫోన్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం, ర్యాష్ డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలను కళ్లకు కట్టినట్టుగా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వివరించారు. అక్కడున్న ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి తగు జాగ్రత్తలతో వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, డీఎస్ తిప్పారెడ్డి, ఇన్‌చార్జి లీలావతి పీటీ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఉద్యోగ అవకాశాలు

గుంతకల్లుటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిభతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరికుమార్ సూచించారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే అన్ని అంశాలపై ఎంతో ప్రతిభ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు 15 రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి, శిక్షకుడు గౌతమ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ కేసీ హరికుమార్ ఎన్‌సీసీజెండాను ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రకాష్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ లాస్య పాల్గొన్నారు.

ఆటోబోల్తా- ఇద్దరికి తీవ్రగాయాలు

యాడికి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలకేంద్రానికి చెందిన తండ్రి కొడుకులు జాఫర్, నూర్‌బాషా ఆటోలో తాడిపత్రికి బయలుదేరారు. కాగా స్థానిక వేములపాడు రోడ్డులో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని యాడికిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. నూర్‌బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది.

గేట్స్ విద్యార్థినికి గోల్డ్ మెడల్

గుత్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఉప్పుల లక్ష్మీచైతన్య జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహించారు. ఇందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సర సైబర్ సెక్యూరిటీ చదువుతున్న ఉప్పుల లక్ష్మీచైతన్య పాల్గొని 94శాతంతో ఉత్తీర్ణత సాధించింది. జాతీయ స్థాయిలోనే మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఇందుకు ఆ విద్యార్థినికి గోల్డ్‌మెడల్ ఇస్తున్నట్లు ఐఐటీ ఖరగ్పూర్ వెల్లడించింది. కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ విద్యార్థినిని అభినందించారు.

కసాపురంలో వెండి రథ ప్రాకారోత్సవం



వెండి రథ ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస శనివారాన్ని పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో ప్రత్యేక పూజలు, వెండి రథ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక అలంకరణలు చేశారు. రాత్రి శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలకు అలంకారాలుచేసి వెండి రథంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దిగ్భ్రాంతి

పుట్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం తలగాచిపల్లిక్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు మృతిచెందడంపై టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని వారు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓలు

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర సాఫ్ట్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు వీటిని నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంఈఓలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులు మార్‌ఫాస్ట్ చేసి జాతీయ, క్రీడా జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం వివిధ జిల్లాల జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. హెచ్ఎం సత్యనారాయణ, సర్పంచ్ ఇందిర పాల్గొన్నారు.